ఒక గుజరాతీ దండయాత్ర

మొదటిపేజీ తరువాయి...

వెళ్లి భారీగా ప్రాజెక్టులు, నిధులు ప్రకటించటం పరిపాటి. కానీ, తెలంగాణకు మాత్రం ఉత్తచేతులతో వచ్చి శాపనార్థాలు పెట్టి వెళ్తున్నారని మండిపడుతున్నారు. ప్రధానిననే విషయం కూడా మరిచిపోయి ఇష్టం వచ్చినట్టు మాట్లాడారని, గల్లీ లీడర్ల మాదిరిగా పచ్చి అబద్ధాలు వల్లె వేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

100 మంది ఎమ్మెల్యేలున్న పార్టీ భయపడుతుందా?

జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత సీఎం కేసీఆర్ తనవద్దకు వచ్చి ఎన్డీయే కూటమిలో చేరుతామని చెప్పారని, కానీ తాను తిరస్కరించానని పరమ రహస్యమేదో బయటపెట్టినట్టు మోదీ ఊరించి ఊరించి చెప్పారు. వంద మంది ఎమ్మెల్యేలున్న పార్టీ జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నాలుగు సీట్లు గెలిచిన బీజేపీని చూసి భయపడుతుందా? కేసీఆర్ రెండోసారి సీఎం అయిన తర్వాత బీఆర్ఎస్‌ను ఇతర రాష్ట్రాల్లో విస్తరించేందుకు ప్రణాళికలు వేస్తూ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సమదూరం పాటిస్తున్నారు. అలాంటప్పుడు ఆయన ఎన్డీయేలో ఎందుకు చేరటానికి మొగ్గుచూపుతారని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. కేంద్రప్రభుత్వ విధానాలను సీఎం కేసీఆర్ మొదటి నుంచీ విమర్శిస్తూనే ఉన్నారు. అలాంటప్పుడు ఆ ప్రభుత్వాన్ని నడిపే ఎన్డీయేలో ఎందుకు చేరుతారని నిలదీస్తున్నారు. బీజేపీతో చేతులు కలుపడం అంటే పార్టీకి ఉరితాడు సిద్ధం చేసుకున్నట్టే. ఇందుకు శివసేన, ఎన్సీపీ ప్రత్యక్ష ఉదాహరణలు. బీజేపీతో స్నేహం చేసిన పాపానికి.. ఆ రెండు పార్టీలూ నిలువునా చీలిపోయాయి. పంజాబ్‌కు చెందిన శిరోమణి అకాలీదళ్ దేశంలోనే రెండో ప్రాచీన పార్టీ. ఆరుసార్లు పంజాబ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఘన చరిత్ర ఆ పార్టీ సొంతం. కానీ.. ఎన్డీయేతో కలిసిన తర్వాత బీజేపీ క్రమంగా మింగేయడంతో ఉప ప్రాంతీయ పార్టీగా మారిపోయింది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 3 సీట్లు సాధించిన ఆ పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ఏపీలో టీడీపీ పరిస్థితి కూడా అంతే. స్నేహం చేసిన పార్టీలనే మింగేసే చరిత్ర బీజేపీది. ఇలాంటి పరిణామాలే జరుగుతుండటంతో బీహార్‌లో జేడీయూ, తమిళనాడులో అన్నాడీఎంకే ముందుగానే బీజేపీతో తెగతెంపులు చేసుకున్నాయి. అలాంటి కూటమిలో సీఎం కేసీఆర్ ఎందుకు చేరుతారన్నది నిపుణుల ప్రశ్న. వచ్చాం కాబట్టి ఒక నింద వేసిపోవాలన్న ఉద్దేశం తప్ప మోదీ వ్యాఖ్యల్లో కొంత కూడా వాస్తవం లేదని స్పష్టం అవుతున్నది.



కేటీఆర్ సీఎం కావటానికి మోదీ ఆశీస్సులెందుకు?

కేటీఆర్‌ను సీఎంను చేస్తానని, అందుకు తన ఆశీస్సులు కావాలని కోరినట్టు ప్రధాని మోదీ గొప్పలకు పోయారు. బీఆర్ఎస్‌కు రాష్ట్ర అసెంబ్లీలో 100 మంది ఎమ్మెల్యేల బలం ఉన్నది. కేటీఆర్‌ను సీఎంను చేయాలంటే బీఆర్ఎస్ఎల్పీ నిర్ణయం తీసుకొంటుంది. దానికి బీజేపీ అనుమతి అవసరం లేదు. మోదీ ఆశీస్సులు అస్సలే అవసరం లేదు. మరి కేసీఆర్ తనను ఆశీస్సులు కోరారని మోదీ చెప్పటంలో లాజిక్ ఏమైనా ఉన్నదా? అని మేధావులు ప్రశ్నిస్తున్నారు. దేశంలోని రాష్ట్రాల ముఖ్యమంత్రులంతా మోదీ ఆశీస్సులతోనే ఆ పదవులు చేపట్టారా? అని నిలదీస్తున్నారు. కేటీఆర్‌ను సీఎంను చేయాలని బీఆర్ఎస్ఎల్పీ నిర్ణయిస్తే బీజేపీకి ఆపే శక్తి ఉన్నదా? అని ఎద్దేవాచేస్తున్నారు.

అవినీతి ఉంటే ఇన్నాళ్లు ఏం చేస్తున్నారు?

బీజేపీకి అధికారమిస్తే బీఆర్ఎస్ సర్కారు అవినీతిని బయటపెడుతామని మోదీ చెప్పుకొచ్చారు. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్నది బీజేపీనే కదా? దాదాపు పదేండ్లుగా బీజేపీ అధికారంలో ఉన్న ఆ పార్టీ ఇంతకాలం ఏం చేస్తున్నట్టు? ఈడీ, సీబీఐ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను మోదీ ప్రభుత్వం జేబు సంస్థలుగా వాడుకొని ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. మరి తెలంగాణలో సీఎం కేసీఆర్‌పైనో, మంత్రులపైనో ఎందుకు ప్రయోగించడం లేదు? ఇక్కడ అవినీతి జరిగితే ఎందుకు ఇంతకాలం ఎందుకు ఉపేక్షించారు? అని ప్రజలు నిలదీస్తున్నారు.

భయంతోనే గగ్గోలు

ఇటీవలే రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చి, సీఎం కేసీఆర్‌ను తమ ఇండియా కూటమిలోకి రావొద్దని అడ్డుకున్నానని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మాత్రం ఇండియా కూటమి సమావేశాలకు కేసీఆర్ హాజరుకావటంలేదని విమర్శించారు. కూటమిలో చేరాలని ఆహ్వానించినా కేసీఆర్ రావడం లేదని ఒప్పుకున్నారు. ప్రధాని మోదీ మంగళవారం నిజామాబాద్‌లో మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమిలో చేరుతానని సీఎం కేసీఆర్ అడిగినా తాను వద్దన్నానని గప్పాలు కొట్టారు. రేపు మరో బీజేపీ నాయకుడు వచ్చి 'ఎన్డీయే కూటమిలోకి సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించినా రావడం లేదు' అని చెప్తారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వాస్తవానికి ఈ రెండు కూటములకు సీఎం కేసీఆర్‌తో, బీఆర్ఎస్‌తో అవసరం ఉన్నది. తెలంగాణలో అత్యంత బలంగా ఉన్న బీఆర్ఎస్‌కు మహారాష్ట్ర, ఏపీతోపాటు అనేక రాష్ట్రాల్లో పెరుగుతున్న ఆదరణను తమకు అనుకూలంగా మార్చుకోవాలని రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. అయితే సీఎం కేసీఆర్ 'కాంగ్రెసేతర, బీజేపీయేతర ప్రత్యామ్నాయ వేదిక' అనే నినాదాన్ని ఎత్తుకోవడంతో ఆ పార్టీలకు భయం పట్టుకొన్నది. అందుకే అసంబద్ధమైన ఆరోపణలు చేస్తూ, సీఎం కేసీఆర్ పరపతిని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాయని రాజకీయ పండితులు అంటున్నారు.

స్వాగతించడానికి రావద్దన్నది మీరు కాదా?

- బీజేపీ అవినీతిపై మాట్లాడాం
- ఎవరితోనూ పొత్తు లేదు..
- ప్రధాని మోదీవి జుమ్లా మాటలు
- కేసీఆర్‌పై ప్రధాని వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ ఫైర్

హైదరాబాద్, అక్టోబరు 3 (నమస్తే తెలంగాణ): కొవిడ్ సమయంలో భారత్‌బయోటెక్ సందర్శనకు వచ్చిన ప్రధానికి స్వాగతం పలికేందుకు ముఖ్యమంత్రి రావద్దంటూ ప్రధాన మంత్రి కార్యాలయమే సమాచారం ఇచ్చిందని, మొదట ప్రధాని మోదీ దీనిపై సమాధానం చెప్పాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ నిలదీశారు. 'సీఎం కేసీఆర్ వస్తానంటే వద్దన్నది ఎవరు? కేసీఆర్‌ను చూసి మీరు భయపడ్డారా? మిమ్ముల్ని చూసి కేసీఆర్ భయపడ్డారా?' అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్‌పై ప్రధాని మోదీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నిజామాబాద్‌లో కేసీఆర్‌పై మోదీ చేసిన ఆరోపణల గురించి తాజ్‌కృష్ణా హోటల్‌లో మీడియా అడిగిన ప్రశ్నలకు వినోద్‌కుమార్ సమాధానమిచ్చారు. స్వాగతించడానికి సీఎం రాలేదని చెప్తున్న మోదీ.. కొవిడ్ సమయంలో ఎందుకు రానివ్వలేదని ప్రశ్నించారు. ఏ రాష్ట్రానికి పోయినా అక్కడికి ఎవ్వరినీ మోదీ రానివ్వరని, ఇటీవల చంద్రయాన్-3 విజయవంతం సందర్భంగా బెంగళూరుకు వచ్చిన సందర్భంలోనూ కర్ణాటక ముఖ్యమంత్రిని రానివ్వలేదని గుర్తుచేశారు. తన ఒక్కడికే గుర్తింపు రావాలని, తాను ఒక్కడే ప్రచారం పొందాలనే ఆలోచనే మోదీకి ఉంటుందని చెప్పారు. ఎన్డీఏలో చేరికి అంశాన్ని ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నారని, ఇన్ని రోజులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో మాట్లాడే వన్నీ జుమ్లా మాటలని, నీటిమాటలని బీజేపీ నేత అమిత్‌షానే చెప్పారని, మోదీ వ్యాఖ్యలను కూడా అలాగే పరిగణించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ సాధించడానికి గొంగళి పురుగునైనా కౌగిలించుకుంటామని పార్టీ స్థాపించిన నాడే చెప్పామని గుర్తుచేశారు. తెలంగాణ సాధించిన తరువాత బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేస్తున్నదని, అదే మాటపై ఇప్పటికీ ఉన్నామని పేర్కొన్నారు. తాము ఏ పార్టీతోనూ పొత్తులపై మాట్లాడలేదని స్పష్టం చేశారు. బీజేపీ ప్రభుత్వ అవినీతి గురించి బీఆర్ఎస్ బహిరంగంగానే చెప్పిందని, అదానీ, రాఫెల్ తదితర అంశాలపై పార్లమెంట్‌లోనూ, ఇతర వేదికలపైనా మాట్లాడామని గుర్తు చేశారు.

రైలు ప్రారంభోత్సవం సందర్భంగా సిద్దిపేట రైల్వేస్టేషన్‌లో వేదిక వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో కనిపించని సీఎం కేసీఆర్, జిల్లా మంత్రి హరీశ్‌రావు, స్థానిక ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫొటోలు

సొమ్ము ఒకరిది.. సోకు ఒకరిది

రైల్వే అధికారుల అత్యుత్సాహం ● రాజకీయ కార్యక్రమంలా రైలు ప్రారంభోత్సవం

- ఫ్లెక్సీలో కనిపించని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ఫొటోలు
- ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం
- బీఆర్ఎస్, బీజేపీ నినాదాలు
- ఆకుపచ్చ జెండా ఊపి రైలును ప్రారంభించిన మంత్రి హరీశ్
- రైలులోనే దుద్దెడ వరకు ప్రయాణం

సిద్దిపేట, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట-సికింద్రాబాద్ రైలు ప్రారంభోత్సవంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. అధికారిక కార్యక్రమాన్ని రాజకీయ కార్యక్రమంలా మార్చేశారు. ప్రొటోకాల్‌ను గాలికి వదిలేశారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ ప్రాజెక్టును చేపట్టినా సిద్దిపేట రైలు ప్రారంభోత్సవం సందర్భంగా వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి కేసీఆర్, స్థానిక మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫొటోలను విస్మరించారు. సమాచారం ఇవ్వడంలోనూ రైల్వే అధికారులు నిరక్ష్యంగా వ్యవహరించారు. ప్రారంభోత్సవ సమాచారాన్ని కొన్ని గంటల ముందు మాత్రమే ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి ఫోన్ ద్వారా తెలియజేశారు. విషయం తెలిసిన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సిద్దిపేటలో సిద్దిపేట-సికింద్రాబాద్ రైలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఆర్ఎస్-బీజేపీ కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేయడంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్లకార్డులతో 'దేశ్ కీ నేత కేసీఆర్ 'అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి అనుకూలంగా నినదించారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో కట్టిన రైల్వేలైన్‌కు కేంద్ర ప్రభుత్వ సోకులేంటని బీఆర్ఎస్ కార్యకర్తలు, సిద్దిపేట ప్రజలు నినదించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సంయమనం పాటిస్తున్నా బీజేపీ కార్యకర్తలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలపైకి కుర్చీలు విసరడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ ఘటనలో కొందరు కార్యకర్తలతోపాటు పోలీసులు కూడా స్వల్పంగా గాయపడ్డారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.20 గంటల వరకు కొనసాగింది. రైలు ప్రారంభం తర్వాత గొడవ సద్దుమణిగింది.

కాంగ్రెస్, బీజేపీ ఏనాడూ పట్టించుకోలేదు

సమైక్య రాష్ట్రంలో మనోహరాబాద్-కొత్తపల్లి రైలు మార్గం కాగితాలకే పరిమితమైంది. అప్పటి ఆంధ్రా పాలకులు రాష్ట్రం వాటాను చెల్లించకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. తెలంగాణ సిద్ధించి కేసీఆర్ సీఎం అయ్యాక మళ్లీ దీనికి కదలిక వచ్చింది. ఈ రైల్వే లైన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 640 కోట్లకు పైగా చెల్లించింది. ఒక్క కోర్టు కేసు కూడా లేకుండా ఈ ప్రాజెక్టు పూర్తి కావడం దేశంలోనే తొలిసారి. సీఎం కేసీఆర్ నిరంతర పర్యవేక్షణ, మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో ప్రాజెక్ట్ విజయవంతంగా పూర్తయింది. వాస్తవం ఇలా ఉంటే బీజేపీ నాయకులు మాత్రం ఈ ప్రాజెక్టుకు నిధులు మొత్తం కేంద్రమే ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంటున్నారు. మంగళవారం జరిగిన రైలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఇది స్పష్టంగా కనిపించింది. బీజేపీ తీరు సొమ్ము ఒకరిది-సోకు మరొకరిది అన్నట్టుగా తయారైందని ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

జెండా ఊపి రైలును ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సంబురాల మధ్య మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవెర్గు మంజుల రాజనర్సుతో కలిసి మంగళవారం మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట రైల్వేస్టేషన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సిద్దిపేట-సికింద్రాబాద్ (కాచిగూడ) రైలును ప్రారంభించారు. అనంతరం ఎంపీ ప్రభాకర్‌రెడ్డితో కలిసి రైలులో దుద్దెడ వరకు ప్రయాణించారు. అక్కడ స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు గజమాలతో మంత్రి హరీశ్‌రావుకు ఘనస్వాగతం పలికారు. బాణసంచా కాల్చి జై కేసీఆర్, జై హరీశ్‌రావు అంటూ నినాదాలు చేశారు. సిద్దిపేటవాసుల దశాబ్దాల కల నెరవేరడంతో రైలును చూసేందుకు రైల్వే స్టేషన్‌కు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రైలు వద్ద సెల్ఫీలు దిగి, స్టేటస్‌లు పెట్టుకుంటూ సంతోషంగా గడిపారు.

ప్రధాని మోదీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వాగతం పలుకుతున్న మంత్రి వేముల

పసుపు బోర్డుపై స్పష్టతేదీ?

- నిజామాబాద్‌లోనూ పాతపాటే వినిపించిన నరేంద్రమోదీ
- సీఎం కేసీఆర్‌ను దూషించడానికే ఎక్కువ సమయం కేటాయింపు
- మోదీ మాట్లాడుతుండగా వెళ్లిన జనం

నిజామాబాద్, అక్టోబరు 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ మళ్లీ పాత పాటే పాడారు. ప్రసంగం చివరలో పసుపుబోర్డు గురించి ప్రస్తావించిన మోదీ.. కనీసం విధి విధానాలపై కూడా స్పష్టత ఇవ్వలేదు. జిల్లా కేంద్రంలో ప్రధాని పర్యటన ఇలా మొదలై అలా ముగిసింది. ప్రధాని హోదాలో రెండోసారి జిల్లాకు వచ్చిన మోదీ.. జిల్లాకు నవోదయ కళాశాల, రైల్వేలైన్ డబ్లింగ్, నూతన రైళ్ల సదుపాయం, జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టుపై స్పష్టత ఇస్తారని స్థానికులు ఆశించారు. కానీ, ప్రధాని ఉసూరుమనిపించారు. సుమారు 40 నిమిషాలపాటు సాగిన ప్రసంగంలో కేసీఆర్‌ను దూషించడానికే ఎక్కువ సమయం కేటాయించారు. తెలంగాణ ప్రజల మేలు కోసం ఎలాంటి ప్రకటనా చేయలేదు. ప్రసంగం చివరలో (35వ నిమిషం) చూచాయగా పసుపుబోర్డు అంశాన్ని ప్రస్తావించడం అనుమానాలకు తావిస్తున్నది. జాతీయ పసుపుబోర్డు ఏర్పాటు విషయంలో కేంద్రం తీసుకోబోతున్న చర్యలపై స్పష్టత ఇవ్వలేదు. పసుపుబోర్డు విధివిధానాలేమిటో చెప్పలేదు. కరోనా కాలంలో పసుపు వాడకం పెరిగిందని, అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడిందంటూ పాత కథే వినిపించారు. ఇందూర్ జనగర్జనలో మోదీ ప్రసంగిస్తున్న సమయంలో జనం మెల్లగా జారుకున్నారు.

మోదీ నీ సాయమెందుకు?

- నీ ఎమ్మెల్యేల సంఖ్య ఎంత? నీ బలమెంత?
- ఎమ్మెల్యేలను కొంటూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నది మీరే
- ప్రధాని మోదీ వ్యాఖ్యలపై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఫైర్

ఖలీల్‌వాడీ, అక్టోబర్ 3: 'కేటీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేయాలంటే నీ సహాయం ఎందుకు? నీ ఎమ్మెల్యేల సంఖ్య ఎంత? నీ బలమెంత? వంద మంది ఎమ్మెల్యేల బలం ఉన్నది మాకు. కేసీఆర్ అనుకుంటే ఎమ్మెల్యేల బలంతో కేటీఆర్‌ను సీఎంగా చేయొచ్చు. ఇందులో నీ బోడి సాయం ఎవడికి కావాలి' అంటూ ప్రధాని మోదీ వ్యాఖ్యలపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధాని మోదీ అబద్ధాల కోరు అని విమర్శించారు. సీఎం కేసీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేయ డం దుర్మార్గమని మండిపడ్డారు. 'ఎన్డీఏలో కలుస్తానని కేసీఆర్ చెప్ప డం పచ్చి అబద్ధం. ఎన్డీఏలో కలవమని మీరు బతిమిలాడితే దేశాన్ని అమ్మే వారితో కలువబోమని కేసీఆర్ కరాఖండిగా చెప్పారు' అని పేర్కొన్నారు. 'కేసీఆర్‌పై ఎన్నికల వేళ అవినీతి ఆరోపణలు చేస్తున్న నీవు ఇన్ని రోజులు ఏమి చేశావు? దర్యాప్తు సంస్థలన్నీ నీ జేబులోనే ఉన్నాయి కదా' అని ప్రశ్నించారు. తన మిత్రులైన కార్పొరేట్లకు రూ.12 లక్షల కోట్ల బ్యాంకు రుణాలు మాఫీ చేసి, ఆ అక్రమ డబ్బుతో ఎమ్మెల్యేలను కొంటూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. 'తెలంగాణ అంటేనే నరనరాన విషం నింపుకున్న మోదీ రాష్ట్రానికి చేసింది శూన్యం. ఆయన తెలంగాణ అభివృద్ధికి బద్ధ వ్యతిరేకి. నిజామాబాద్‌లో కేసీఆర్ నిర్మించిన కలెక్టరేట్, కేటీఆర్ నిర్మించిన ఐటీ టవర్‌ను చూసి కన్ను కుట్టి ఏవేవో కహానీలు చెప్పారు' అని ధ్వజమెత్తారు.

మోదీది దిగజారుడు రాజకీయం: బాలమల్లు

హైదరాబాద్, అక్టోబరు 3 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ తన స్థాయిని దిగజారి సీఎం కేసీఆర్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేశారని టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు విమర్శించారు. మోదీ ని ఆహ్వానించడానికి రావద్దని గతంలో ప్రధానమంత్రి కార్యాలయమే చెప్పిందని, ఇప్పుడు మాత్రం తనను చూడటానికి కేసీఆర్ భయపడుతున్నారంటూ వ్యాఖ్యానించడం ఆయన స్థాయికి సరికాదని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుపై పార్లమెంట్ సాక్షిగా అనేకమార్లు విషం కక్కిన మోదీ తాజాగా కేసీఆర్‌పై విషం క క్కారని మండిపడ్డారు. బీఆర్ఎస్ 2014 నుంచి ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదని, పెట్టుకోదని కేసీఆర్ బహిరంగంగానే ప్రకటించార ని గుర్తుచేశారు. 119 స్థానాలకు 115 స్థానాల్లో ఒకేసారి అభ్యర్థులను ప్రకటించిన చరిత్ర కేసీఆర్‌ది అని, అభ్యర్థుల కోసం వె తుక్కునే పరిస్థితిలో బీజేపీ ఉన్నదని ఎద్దే వా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి డిపాజిట్లు కూడా దక్కవని చెప్పారు.

తెలంగాణపై బీజేపీ నీచ రాజకీయం

రెడ్కో చైర్మన్ వై సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 3 (నమస్తే తెలంగాణ): బీజేపీ, ప్రధాని మోదీ అబద్ధం అనే పదానికి పర్యాయపదాలని తెలంగాణ రెడ్కో చైర్మన్ వై సతీశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్నికల కోసం బీజేపీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. మోదీ పుట్టిన తేదీ అబద్ధం. చాయ్ అమ్మిందీ అబద్ధం. చదువు అబద్ధం అని విమర్శించారు. అబద్ధాల పునాదుల మీద పుట్టి, అబద్ధాలను నిజాలుగా ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని దుయ్యబట్టారు. బీజేపీకి తెలంగాణలో పుట్టగతులు లేకుండా పోయాయని, ఆ ఫ్రస్టేషన్‌లో నోటికొచ్చిన అబద్ధాలన్నీ చెప్పారని విమర్శించారు. నిజామాబాద్‌లో మోదీ మాట్లాడిన మాటల్లో ఒక్కటి నిజం లేదని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో ఓట్ల కోసం ఎంత నీచానికైనా దిగజారుతారని, ఫేక్ ఫ్యాక్టరీ బీజేపీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

సిద్దిపేటలో మోగిన రైలు కూత

సిద్దిపేట రైల్వేస్టేషన్‌లో జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

రైలు బయలుదేరు ప్రాంతం సమయం	చేరుకొనే ప్రాంతం సమయం
సిద్దిపేటలో ఉదయం 6.45 గంటలకు	సికింద్రాబాద్‌కు 10.15 గంటలకు
సికింద్రాబాద్‌లో 10.35 గంటలకు	సిద్దిపేటకు మధ్యాహ్నం 1.05 గంటలకు
సిద్దిపేటలో మధ్యాహ్నం 2.15 గంటలకు	సికింద్రాబాద్‌కు సాయంత్రం 5.20 గంటలకు
సికింద్రాబాద్‌లో సాయంత్రం 5.45	సిద్దిపేటకు రాత్రి 8.45 గంటలకు చేరుతుంది

- సిద్దిపేట-సికింద్రాబాద్ తొలి రైలు సర్వీసును వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- మహబూబ్‌నగర్-కర్నూలు విద్యుదీకరణ కూడా..
- రామగుండం ఎన్టీపీసీలో ఫస్ట్ యూనిట్ ప్రారంభం
- మోదీకి స్వాగతం పలికిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ)/జ్యోతినగర్: దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో మనోహరాబాద్-సిద్దిపేట స్టేషన్ల మధ్య పూర్తయిన నూతన రైలు మార్గాన్ని మంగళవారం ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. మహబూబ్‌నగర్-కర్నూల్ స్టేషన్ల మధ్య పూర్తిచేసిన విద్యుద్ధీకరణను కూడా ప్రధాని ప్రారంభించారు. కర్ణాటకలోని బీదర్ నుంచి హెలికాప్టర్‌లో నిజామాబాద్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి స్వాగతం పలికారు. సమీకృత కలెక్టరేట్‌లో పుష్పగుచ్ఛం ఇచ్చి జిల్లాకు ఆహ్వానించారు. అనంతరం మోదీ సమీకృత కలెక్టరేట్ నుంచి రోడ్డు మార్గంలో జీజీ కాలేజీకి చేరుకున్నారు. అక్కడి నుంచి వర్చువల్ విధానంలో (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా) సిద్దిపేట-సికింద్రాబాద్ తొలి రైలు సర్వీసును ప్రధాని జెండా ఊపి ప్రారంభించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీలో నిర్మించిన 1,600 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని 800 మెగావాట్ల ఫస్ట్ యూనిట్‌ను మోదీ వర్చువల్‌గా జాతికి అంకితమిచ్చారు. తెలంగాణలో రూ.516 కోట్లతో 20 క్రిటికల్ కేర్ బ్లాక్స్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు.

రేపట్నుంచి రైలు రాకపోకలు

సికింద్రాబాద్-సిద్దిపేట మార్గంలో కొత్త రైలు సర్వీసులు ఈ నెల 5 నుంచి ప్రయాణికులతో ప్రారంభమవుతాయని దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం వెల్లడించారు మార్గంలో మొత్తం 14 స్టేషన్లలో ఒక నిమిషంపాటు ఈ రైలు ఆగుతుందని, కేవలం 2.30 గంటల్లోనే ప్రయాణం ముగిసేలా టైంటేబుల్ రూపొందించినట్టు పేర్కొన్నారు. రోజుకు రైలు నాలుగు సర్వీసులు ఉంటాయని అధికారులు వివరించారు.

ఆ మూడు హామీల సంగతేమిటి?

- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి ప్రాణం పోసేదెప్పుడు?
- బయ్యారం ఉక్కు కర్మాగారం నిర్మించేదెప్పుడు?
- 'పాలమూరు'కు జాతీయహోదా దక్కేదెప్పుడు?
- ఐటీ మంత్రి కేటీఆర్ నిలదీత

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): మూడురోజుల వ్యవధిలోనే రెండోసారి తెలంగాణకు వస్తున్న మోదీ.. ఆ మూడు ప్రధాన హామీలను ఏమి చేశారని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు ప్రశ్నించారు. పదేండ్ల నుంచి పాతరేసి ఇంకెంతకాలం ఈ అబద్ధాల జాతరంటూ మంగళవారం ట్వీట్(ఎక్స్) చేశారు. 'కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి ప్రాణం పోసేదెప్పుడు? బయ్యారం ఉక్కు కర్మాగారం నిర్మించేదెప్పుడు? పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయహోదా దక్కేదెప్పుడు? మూడురోజుల వ్యవధిలోనే రెండోసారి వస్తున్నారు కదా? ఆ మూడు ప్రధాన హక్కులకు దిక్కేది?' అని నిలదీశారు. 'పదేండ్ల నుంచి పాతరేసి ఇకెంతకాలం ఈ అబద్ధాల జాతర? మీ మనసు కరిగేదెప్పుడు.. తెలంగాణ గోస తీర